# న్యాయసూక్ష్మాలు

యమధర్మరాజు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశాడు.

చిత్రగుప్తుడి ఆఫీసు నుండి గ్రేడ్ వన్, గ్రేడ్ టూ ఉద్యోగులకందరికీ సమన్‌లు వెళ్ళాయి.

సరిగా టైముకి అందరూ మీటింగుకు హాజరయ్యారు. సభ ఏర్పాటయింది, ఒక వట్టిపోయిన బొగ్గు గనిలో. దాన్ని బట్టి అనేక మంది నరకంలో మళ్ళీ ఇంధనం సమస్యకు ప్రాముఖ్యం వస్తున్నది కాబోలు ననుకున్నారు.

ఆ మధ్య ఇంధన తైలం సమస్య వచ్చింది. నరకంలో ఇలాటి సమస్యలు భూలోకంలో ఉన్నట్టుగా ఉండవు. మనుష్యులు ఏ ఇంధనాన్ని అధికంగా ఉపయోగిస్తే అది నరకానికి అధికంగా సరఫరా అవుతుందన్నమాట. ఆ మధ్య అరబ్బులు పెట్రోలు ధర పెంచేసరికి అమెరికా వారూ, తదితరులూ పెట్రోలు వాడకాన్ని పొదుపు చేయసాగారు. అందువల్ల నరకంలో ఇంధన తైలం కొరత ఏర్పడింది.

అయితే అది చాలా తాత్కాలికం. మళ్ళీ పెట్రోలు వాడకం మామూలయింది. భారత దేశంలో సైతం టాక్సీలను బాయ్‌కాట్ చేసిన వాళ్ళు హెచ్చు ధరలు పరిచయం అయిపోయి, బెదురు తగ్గి, మళ్ళీ టాక్సీలూ అవీ ఎక్కి తిరగటమే కాక, మీటరు పైన మరింత ఇయ్యసాగారు. మూడు లోకాలలోనూ సాటిలేని ఆర్థిక నిపుణుడు చిత్రగుప్తుడు గారన్నట్టు హెచ్చు ధరలంటే ప్రజలకుండే భయం సహజమైనది కాదు.

మళ్ళీ ఈ మధ్య బొగ్గువాడే బడుగు దేశాలలో బొగ్గువాడకం తగ్గింది. ఉదాహరణకు, భారత దేశంలో ఎమర్జెన్సీ తగినంతలేక, రైళ్ళు నడవక, బొగ్గు గనులలో సమ్మెలు జరిగి, వాగన్లు కదలక, కదల్చటానికి సిద్ధంగా ఉన్న బొగ్గు కూడా స్తంభించిపోయి, అందువల్ల నరక కూపాలు మూడు షిఫ్టులూ పని చెయ్యటం లేదేమో!

ఒక గ్రేడ్ వన్, గ్రేడ్ టూ తో రహస్యంగా, "చూస్తూండు! యముడు ఇవాళ మనకు బొగ్గు ఇంధనం గురించి బోరుకొట్టేస్తాడు! ఈ మీటింగు ఖాళీ బొగ్గు గనిలో ఎందుకు ఏర్పాటు చేశాడంటావు? పని చేస్తున్న గనిలో బొగ్గు గుట్టలు చూస్తే మనం ఖిన్నులమై పోతాం... ఇదంతా ఎప్పుడు తగలబడి మనకు అందేట్టు? ఎప్పుడు మనం దీన్ని ఉపయోగించేట్టు? అని దుఃఖపడిపోతాం. అందుకని!"

"ఈ ఏర్పాటు బాగాలేదు – మేష్టారూ! మనుషులు సమ్మె చేసినప్పుడల్లా మన కార్యక్రమాలు దెబ్బతినటమేమిటి?" అన్నాడు గ్రేడ్ టూ.

"అదే గదా మరి! మన అభ్యుదయం ముందున్న దేశాల మీద ఆధారపడి ఉంది. యంత్రయుగం రాకముందు నరకంలో ఇన్ని లక్షల కాలనీలుండేవా! మా తాత చెబుతుంటాడు – లక్ష సంవత్సరాల కింద నరకం అంటే ఇప్పటి పాతపేటేట. ఇంధనం అంటే ముఖ్యంగా కట్టెలు. నరకం జనాభా అంతా కలిపి కొద్ది వందలట. యంత్రయుగం మనకు పాపులను అందించటమే గాక వారిని ఉడకబెట్టటానికి తగిన ఇంధనాలను కూడా ఇస్తున్నది. అయితే ఈ రెంటికీ బాలెన్స్ చెడకుండా చూసుకోవటంలో ఉన్నది యమయ్య తెలివి. ఆయన అమలు చేసిన విధానాలవల్ల పాపుల తయారీలో ఎన్ని విప్లవాలు రాలేదు? తెలివంటే యముడిది. ఏకంగా మతాలతోనే పాపాలు సృష్టి అయ్యేటట్టు చూశాడు. పిశాచాలు వేదాలు వల్లిస్తున్నాయన్న మాట పుట్టింది. అయినా మనుషులు కళ్ళు తెరవలేదు. ఈనాటికి కూడా పిశాచాలు వల్లిస్తేగాని వాళ్ళకు వేదాలలో గురి కుదరదు. అదీ ఓ విధంగా తప్పనిసరే అనుకో. ఎంచేతంటే బుద్ధిమంతులు వేదాలు వల్లించటం మానేశారు. ఒక్క వేదాలే ఏవిటి? బుద్ధిమంతులు వల్లించటం మానేసివన్నీ పిశాచాలచేత వల్లింపజేస్తున్నాడు యమయ్య! అవి మనుషులను వెనక్కు లాగి పట్టటానికి పగ్గాలలాగా ఉపయోగిస్తాయి. ఒకప్పుడు ఉండిన ధర్మ పన్నాలే గనక, వాటిని సృష్టించవలసిన అవసరం కూడా లేదు! ఎలా ఉంది ఏర్పాటు?"

ఆ ఏర్పాటంతా తానే స్వయంగా చేసినట్టుగా గ్రేడ్ వన్ చేతులు రుద్దుకుంటూ పరమానందంతో గ్రేడ్ టూ కేసి చూశాడు.

ఇంతలో అకస్మాత్తుగా బొగ్గుగనిలో నిశ్శబ్దం నెలకొన్నది. యముడు వచ్చి అధ్యక్షపీఠం – అలంకరించాడనే అనాలి, మరో మాట లేనందున.

సభ ఆరంభమయింది.

యమధర్మరాజు ఆసనంలో చేరగిలబడి కూర్చుని, ఎజెండా కాగితం ఎగాదిగా చూసి, "చిత్రగుప్తుడు ఇంధన పరిస్థితి గురించి రిపోర్టు చదువుతాడు–" అన్నాడు.

గ్రేడ్‌వన్ గ్రేడ్‌టూ కేసి గర్వంగా చూశాడు.

"–తరవాత అసలు విషయానికి వస్తా" అని యముడు పూర్తి చేశాడు.

చిత్రగుప్తుడు రిపోర్టు చదివాడు.

"ముందుకు వస్తున్న మూడో ప్రపంచానికి ఇంధనం సమస్య ఎలాగూ ఉంటుంది. మనకంటూ వేరే ఇంధనం లేదు గనక మనం ఇంధనం కోసం గొప్ప దేశాలమీద ఆధారపడి ఉన్నాం. మనం ఇప్పుడు ఈ సమావేశం జరుపుకుంటున్న ఈ గని ఒక్కటి మనకు అనేక వందల ఏళ్ళపాటు ఉపయోగించింది. ఇవాళ మనకు ఇలాటి గనులు అయిదారు నెలల కొకటి చాలటంలేదు.

"పాపుల జనాభా పెరుగుతున్నది. మన కొలుములను ఆధునికీకరించటమేగాక, సంఖ్య కూడా పెంచాం. మనుషులు అవలంబించే కొత్త కొత్త ఇంధనాలు మనం ఎప్పటికప్పుడు వాడుక చేస్తున్నాం. అయితే వాళ్ళు యుద్ధరంగం కోసం సృష్టించే మందుగుండు సామాగ్రీ, ప్రేలుడు పదార్థాలూ, బాంబు ఇంధనాలూ, రాకెట్ ఇంధనాలూ లాటివి మనకు అంతగా ఉపకరించవు. అవి నిలిచి కాలవు. అణుశక్తిమీద మన వాళ్ళు కొందరు ఆశలు పెట్టుకున్నారు. కాని అది మరీ అన్యాయం. అంత మహత్తర శక్తి కొద్ది గంటలలో తీసి పోతుంది.

"అణుశక్తిలో మరొక చిక్కు ఎక్కడ వచ్చిందంటే, దాన్ని మనుషులు భారీ ఎత్తున ఉపయోగించలేరని స్పష్టం అయిపోయింది. అయినా మన వాళ్ళు పేలిన ఆ బాంబుల శక్తిని నిలవజేసి ఉపయోగించే మార్గాలు చూస్తున్నారు. అందుచేత వాళ్ళు బాంబుల పేలుళ్ళు నిషేధించినప్పుడు మన ఏజెంట్ల ద్వారా భూగర్భ పరిశోధనల వంకబెట్టి కొనసాగింప జేశాం. అణుశక్తిని మనుషులు తియ్యకుండా వాడేటట్టు చేస్తే మనకు ఇంధన సమస్య ఉండదు. అలాగే సౌరశక్తి కూడా మనుషులు విరివిగా ఉపయోగించేటట్టు చూస్తున్నాం. మనకు ఇంధనాల సమస్య ఉండబోదని నమ్మకంగా చెప్పగలను. (చప్పట్లు)

"ఇంధన సమస్య కన్నా పాపుల సమస్య నా దృష్టిలో ఎక్కువ ప్రాముఖ్యం గలది. ఏ కారణాల వల్లనైనా పాపుల సంఖ్య తగ్గిపోతే మన నరక కూపాలకు పని ఎలా ఉంటుంది? ఇంధనం ఉంటేనేం, లేకపోతేనేం? అన్ని దేశాలూ – చివరకు పాపిష్టి కమ్యూనిస్టు దేశాలు కూడా కుటుంబ నియంత్రణ అంటున్నాయి. జనాభాలో అధికశాతం, ఈ కలిలో, పాపులుగానే ఉంటున్నారు. అందుచేత జనసంఖ్య పెరగకపోతే పాపుల సంఖ్య పెరగదు. ఈ ఉద్యమం ఎప్పటికైనా జీరోగ్రోత్ సాధించేటట్టుంటే మనకు ప్రగతి ఉండదు.

"మనకు ఇంకొక సెట్‌బాక్, సంఘ సంస్కరణలతో జరగబోతున్నది. మనుషులను దోచుకునే మనుషులమీద ఆధారపడి మనం కనీసం రెండు, వెనకటి కాలంలో ఏ ధర్మ రాజంటి వాడో మన లోకానికి వచ్చి, అలా తొంగిచూసి పోతే మనం గర్వంగా వీపులు చరుచుకుని, వ్యాసులవారి కాళ్ళా వేళ్ళా పడి, ఆ విషయం రాయించుకున్నాం. ఇప్పుడలాకాదు, ధర్మరాజు బాబుల్లాటి వాళ్ళు, గొప్ప గొప్ప సీఐడీలు మన క్లయింట్లు! పాపాగ్రేసర చక్రవర్తులు – వాళ్ళు, ఘరానా పాపాలు చెయ్యడం అలా ఉంచి కోట్లాది జనం పాపాలు చెయ్యకుండా బతికే మార్గం లేని పరిస్థితి కల్పిస్తారు.

"అవునుగదా? అలాటప్పుడు సోషలిజం ఏమిటి? పాపాలు ఏవీ చెయ్యనవసరం లేకుండా మనుషులు బతికే వ్యవస్థ ఏమిటి? ఇది మనకు ఎంతో హానికరం. ఈ సోషలిజమునూ, కమ్యూనిజమునూ నీరుగార్చే మార్గాలు చూస్తున్నాం. అది మీ కందరికీ తెలిసినదే. సామ్రాజ్యవాదం నుంచి సోషలిజం పుట్టితే, సోషలిజం నుంచి కూడా సామ్రాజ్యవాదం పుట్టవచ్చునని నిరూపించి చూపిస్తాం. (చప్పట్లు)

"ఇవాళ మనం చర్చించవలసినది వీటన్నిటికంటే ముఖ్యమైన నైతిక - ధార్మిక సమస్య. దాన్ని గురించి మన నేతాజీ ఇప్పుడు మీకు వివరంగా చెబుతారు."

కరతాళ ధ్వనుల మధ్య చిత్రగుప్తుడు కూర్చున్నాడు.

"ఇది సాల్ట్ గురించి... ఉప్పుకాదు, ఆయుధ పరిమితి - అంటే ఎనిమిది ప్రపంచ యుద్ధాలకు సరిపడినంత ఆయుధాలే ఏ దేశం అయినా ఉంచుకోవాలని - ఒప్పందం" అన్నాడు గ్రేడ్ వన్ గ్రేడ్ టూ చెవిలో.

యముడు కుర్చీలో సరిగా కూర్చుని మైక్ మీద ఉఫ్ అని ఊది, చిటికెలువేసి, కొంచెం వాల్యూం పెంచమని ఎలెక్ట్రీషియన్‌కు సైగచేసి, గొంతు సవరించుకొని, మైక్‌కేసి అనుమానంగా చూసి ప్రారంభించాడు.

"ఇది చట్టాలకూ, న్యాయప్రవృత్తికీ సంబంధించిన సమస్య. కవి సమ్రాట్ చెప్పినట్లు పాతధర్మాలు ఈనాడు పనికి రావు. (సభలో ఎవరో, "ఆయన పనికొస్తాయన్నాడండీ!") అవును, ఆయన చెప్పినది తప్పు... భాషలో వాక్య నిర్మాణం రెండంచుల కత్తిగా ఉంటే ఇదే చిక్కు!... పూర్వం ప్రతిదీ దైవకృతం. మనిషికి కర్తృత్వం ఏమీలేదు. నేరాలు దేవుడు చేయించేవాడు. నేరస్థులకు శిక్ష పడితే దేవుడే ఆ శిక్షను నిర్ణయించేవాడు. అది సహజన్యాయం. నేరస్థుడు తప్పుచేశాడో లేదో పంచభూతాలే సాక్షులు. రంకుటాలిని నిప్పుల్లో వెయ్యి. అది కాలకపోతే పతివ్రత! రాజద్రోహిని మెడనరుకు. కత్తిపుష్పహారమై మెడలో పడితే వాడు రాజభక్తి గలవాడు!

"ఇప్పుడది పూర్తిగా పోయింది. ప్రతిదానికీ సాక్షులు! దొంగ సాక్ష్యాలున్నాయని మనుషులు గోలపెడుతూనే ఉన్నారు. అయినా సాక్ష్యానికి విలువ ఉంటున్నది. ఇదంతా మనకెందుకని మీరు అనవచ్చు. పాపులకు భూలోకంలో శిక్షలు పడడం మనకు చాలా నష్టం. అందులోనూ ఘరానా పాపులు మనుషుల న్యాయస్థానాలలో ఎంత మాత్రమూ శిక్ష పొందరాదు. అలా జరగనియ్యడం మనం ఎక్కివున్న కొమ్మను మనమే నరుక్కోవడం అవుతుంది. మనుషుల సాక్ష్యాలకు ఇప్పుడు టేప్ రికార్డులు, ఫొటోస్టాట్ కాపీలూ వగైరా తోడయ్యాయి.

"దీనికి విరుగుడు ఏమిటి? చట్టాలను క్లిష్టం చెయ్యాలి. మనకు అనేకమంది పాపులను అందజేసిన ఒక గొప్ప ఆశ్రమ నిర్వాహకుడికి నేను ఒక బ్రహ్మాండమైన సూచన చేశాను. ఆశ్రమంలో ఒక సంపన్నుణ్ణి ఒక అనాథ మరిగింది. వారిద్దరూ కామ క్రీడలలో ఉండగా చూసి ఒక చచ్చువెధవ ఆశ్రమవాసి, తాను గొప్పపని చేస్తున్నాననుకుని, ఆశ్రమం నిర్వహించే స్వాముల వారివద్దకు పోయి, ఫలానా వారిద్దరూ నిక్షేపంగా మన్మథసేవ చేస్తున్నారని చెప్పాడు. ఇలా జరుగుతున్నదని స్వామికి చూచాయగా తెలుసు. కాని ఆ కాముకులు అంత తేలికగా దొరికిపోతారని ఆయన అనుకోలేదు. ఆయన ఖంగుతిన్నాడు.

ఆ సమయంలో టెలిపతీ ద్వారా ఆయన బుర్రలోకి ఆలోచన పంపించాను. చప్పున జ్ఞానోదయమైనట్టుగా ఆయన ఆశ్రమవాసితో "నిన్ను వాళ్ళమీద వేగు చెయ్యమని ఎవరు చెప్పారు? ఆశ్రమ నిబంధనలకు వ్యతిరేకంగా ప్రవర్తించావు" అని ఆ ఫిర్యాదు చేసినవాణ్ణి తెల్లవారే లోపుగా ఆశ్రమం నుంచి వెళ్ళగొట్టించాడు.

"ఇందులో ఒక గొప్ప సూత్రం ఉన్నది. మనం ఎవరిమీద ఆధారపడుతున్నామో వాళ్ళు అనేక కూడని పనులు రహస్యంగానూ, ఎవరేమీ చెయ్యలేరనుకున్నప్పుడు బాహాటంగానూ చేస్తారు. వాళ్ళను తక్కువవాళ్ళు న్యాయస్థానాల కీడుస్తారు. మనం మెలకువగా ఉండి, న్యాయ చట్టాలలో బొక్కలు పెట్టాలి. విచారణప్పుడు జరిగిన అక్రమాలను వెనక్కునెట్టి, ఇది కోర్టేనా? వీడు న్యాయమూర్తేనా? సాక్ష్యాధారాలు కృత్రిమమైనవికాదా! సాక్షులు ఏ దురుద్దేశంతో సాక్ష్యం ఇస్తున్నారు? ఇందులో రాజకీయాలున్నాయా, లేదా? న్యాయానికీ రాజకీయాలకూ పొత్తు కుదరదు కాబోలునని జనం తేలిగ్గా నమ్మేస్తారు... శాసనాలు నాక్కూడా వర్తిస్తాయా?" ఇలా ప్రశ్నలు లేవనెత్తాలి. తగిన అధికారాలు గల వాళ్ళు తన కోసం రాజ్యాంగాలనే మార్చుకునేటట్టు చేయాలి. ఇదంతా మన చాకచక్యం మీద ఆధారపడి ఉంది. ఇంతేకాదు. మన న్యాయమూర్తుల బుర్రలు పాడుచేసి, విచారణ; నేరస్థుల జీవితకాలంలో పూర్తికాకుండా చూడాలి. మామూలు మనుషుల బుర్రలు మరీ మట్టివి. తమను కుక్కలల్లే చూసిన వారి పాదాలు వాళ్ళు నొక్కగలరు! ఎన్ని అత్యాచారాలు చేసిన వారినైనా వాళ్ళు సహించగలరు, సమర్థిస్తూ పత్రికలకు లేఖలు రాయగలరు. మనుషుల మధ్య హిట్లర్లకూ, ముసోలినీలకూ స్థానం ఉన్నంతవరకూ మనం వెనకడుగు వెయ్యం. మనుషుల దేవతలు అవ్యాజ హంతకులు. నాస్తికులు వారికి విరుద్ధంగా ప్రచారం చేస్తున్న కొద్దీ, మనం జనంలో అన్ని రకాల మీడియంల ద్వారా భక్తిరసం పారేటట్టు చూడాలి. పుణ్య క్షేత్రాలకూ, దేవుళ్ళకూ, బాబాలకూ గిరాకి పెంచాలి. ఈ ఉద్యమంలో మనం ఎంత కృతకృత్యులైతే మనకు అంతటి మహోజ్వల భవిష్యత్తు ఉన్నది."

యముడు ముగించాడు. సభాసదులు చప్పట్లు కొట్టారు. కొద్ది క్షణాలకు యముడి దున్నపోతు గంటలు వినిపించాయి...

చప్పున నిద్రలేచాను. నేను వింటున్నది క్రికెట్ కామెంటరీ అనీ, ప్రేక్షకులు చప్పట్లు కొట్టుతున్నారనీ తెలిసింది. మా ఇంటి ముందుగా పీచు మిఠాయివాడు గంట కొట్టుకుంటూ పోతున్నాడు.

"పట్టపగలు కుంభకర్ణుడల్లే ఆ నిద్రేమిటి?" అని మా ఆవిడ మందలించింది.

*ముద్రణ. జయశ్రీ మాసపత్రిక, సంక్రాంతి ప్రత్యేక సంచిక, 1980*